

## ఇళ్ల పట్టాల పంపిణీ

ప్రజాశక్తి - శ్రీకాకుళం రూరల్

మండలంలోని సింగుపురానికి చెందిన 50 మంది లబ్ధిదారులకు రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు ఇళ్ల పట్టాలను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు సొంత ఇంటి కలను సాకారం చేసిన ప్రభుత్వం తమదేనని పునరుద్ఘాటించారు. రానున్న కాలంలో ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పేదలకు ఇళ్ల నిర్మాణం చేపట్టడమే కాకుండా, మౌలిక వసతుల కల్పనకు అత్యంత ప్రాధాన్యమిస్తామని చెప్పారు. ఇళ్ల పట్టాలు అందుకున్న వారు సాధ్యమైనంత త్వరగా ఇంటి నిర్మాణాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ వెంకటరావు, వైసిపి రైతువిభాగం జిల్లా అధ్యక్షులు అంబటి శ్రీనివాసరావు, సర్పంచ్‌లు ఆదిత్య నాయుడు, పొన్నాన కూర్మారావు, నక్క శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్మాకు బెదిరేది లేదు

- సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె
- స్పష్టం చేసిన అంగన్వాడీ యూనియన్ నాయకులు
- రేపు జైల్‌భరో
- 27వ రోజుకు అంగన్వాడీల సమ్మె
- జిఒ నంబరు 2 ప్రతులు దగ్ధం చేసి నిరసన

ప్రజాశక్తి - శ్రీకాకుళం యంత్రాంగం

ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఉద్యమిస్తున్న అంగన్వాడీలపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపడాన్ని పలు కార్మిక, ప్రజా, ఉద్యోగ సంఘాల నాయకులు తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వం బెదిరింపులకు పాల్పడడం మాని న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీలపై ఎస్మా ప్రయోగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జిఒ నంబరు 2 ప్రతులను దహనం చేశారు. కనీస వేతనం రూ.26 వేలు, గ్రాట్యుటీ అమలు తదితర సమస్యల పరిష్కారానికి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన అంగన్వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారానికి 27వ రోజుకు చేరింది. శ్రీకాకుళం నగరంలోని జ్యోతిబాపూలే పార్కు వద్ద రెండో రోజు 24 గంటల రిలే నిరాహార దీక్ష చేపట్టారు. జిఒ నంబరు 2 ప్రతులను దహనం చేసి నిరసన తెలిపారు. అంగన్వాడీలపై ఎస్మా ప్రయోగించడం దుర్మార్గమైన చర్య అని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.కళ్యాణి అన్నారు. 27 రోజులుగా సమ్మె చేస్తున్నా, అంగన్వాడీల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. మొండిగా వ్యవహరిస్తూ అణచివేత పద్ధతులను అమలు చేస్తోందని విమర్శించారు. అంగన్వాడీలు అత్యవసర సర్వీసు అని భావించినప్పుడు 27 రోజులుగా సమ్మెను పరిష్కరించకపోవడానికి రాష్ట్ర ప్రభుత్వానిదే బాధ్యత అని అన్నారు. ఎస్మా ప్రయోగం రాష్ట్ర ప్రభుత్వ నియంతృత్వ ధోరణికి నిదర్శనమని, దీన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాలన్నీ ముక్తకంఠంతో ఖండించాలని పిలుపునిచ్చారు. అత్యవసర సర్వీసులంటే నీరు, పాలు, విద్యుత్, రవాణా లాంటి కీలక సర్వీసులు మాత్రమేనని, అంగన్వాడీలు లబ్ధిదారులకు పంచే పోషక పదార్థాలను అత్యవసర సర్వీసులో చేర్చడం చట్ట వ్యతిరేకమన్నారు. పోషణ పదార్థాలను పంచడం రాష్ట్ర ప్రభుత్వానికి చేతకాక అంగన్వాడీలపై అసత్య ఆరోపణలు చేస్తోందని విమర్శించారు. అంగన్వాడీలపై ఎస్మాను ప్రయోగించడం అంటే యావత్ కార్మికులు, ప్రజల ప్రజాతంత్ర హక్కులపై దాడి చేయడమేనని విమర్శించారు. దీనికి నిరసనగా ఈనెల 9న జిల్లావ్యాప్తంగా అన్ని కార్మిక, అనుబంధ సంఘాలు జైల్‌భరో నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఎస్మా జిఒను వెంటనే ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్ కుమార్, రాష్ట్ర కౌన్సిలర్ పొందూరు అప్పారావు, రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, ఎస్ఎఫ్ఐ నాయకులు చందు, టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సూర.పాపారావు తదితరులు సంఘీభావం తెలిపారు.



శ్రీకాకుళం అర్బన్ : జిఒ ప్రతులను దహనం చేస్తున్న అంగన్వాడీలు

పలాసలో కాశీబుగ్గ ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద ఒంటి కాలిపై నిల్చొని దండం పెడుతూ నిరసన తెలిపారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎస్మా జిఒ ప్రతులను దహనం చేశారు. సిపిఐ చాపర వేణుగోపాల్, పౌరహక్కుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పత్రి దానేష్, పిండి వెంకటరావు సిపిఎం నాయకులు బమ్మిడి ఆనందరావు, సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ నాయకులు బొడ్డు వాసుదేవరావు, ఎఐకెఎం నాయకులు వంకల అప్పయ్య సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, అంగన్వాడీ యూనియన్ నాయకులు ఎం.మంజుల, బి.సునీత తదితరులు పాల్గొన్నారు. ఇచ్ఛాపురంలో బస్టాండ్ కూడలిలో సమ్మె శిబిరం వద్ద ఎస్మా జిఒ ప్రతులను దహనం చేశారు. ఎమ్మెల్యే బెందాళం అశోక్ సంఘీభావం తెలిపారు. అంగన్వాడీలపై ఎస్మాను ప్రయోగించడాన్ని తీవ్రంగా ఖండించారు. ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా అంగన్వాడీలను రోడ్డెక్కించే పరిస్థితిని ప్రభుత్వమే కల్పించిందని విమర్శించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, అంగన్వాడీ యూనియన్ నాయకులు హైమ, బాలమణి, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. కోటబొమ్మాళిలో ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద జిఒ ప్రతులను దహనం చేసి నిరసన తెలిపారు. అంగన్వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి డి.సుధ మాట్లాడుతూ ఎస్మాకు భయపడేది లేదని, సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు హనుమంతు ఈశ్వరరావు, అంగన్వాడీలు పాల్గొన్నారు. కొత్తూరులో జిఒ ప్రతులను దహనం చేశారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, పిల్లలు అనేక సేవలు అందిస్తున్న అంగన్వాడీలకు ప్రజలు అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు కె.లక్ష్మి, కె.వి హేమలత తదితరులు పాల్గొన్నారు.



కోటబొమ్మాళి : జిఒ ప్రతులను దహనం చేస్తున్న అంగన్వాడీలు



ఇచ్ఛాపురం : జిఒ ప్రతులను దహనం చేస్తున్న అంగన్వాడీలు



పలాస : ఒంటి కాలిపై నిల్చొని దండం పెడుతూ నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు



పోటీలకు సాధన చేస్తున్న రాష్ట్ర జట్లు

## రేపట్నుంచి జాతీయస్థాయి టెన్నికాయిట్ పోటీలు

### హాజరు కానున్న 23 రాష్ట్రాల క్రీడాకారులు

ప్రజాశక్తి - పలాస

జాతీయస్థాయి టెన్నికాయిట్ ఛాంపియన్‌షిప్ పోటీలకు పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం వేదికగా నిలిచింది. రాష్ట్ర టెన్నికాయిట్ సంఘం ఆధ్వర్యాన ఈనెల తొమ్మిది నుంచి 13వ తేదీ వరకు సీనియర్ జాతీయ టెన్నికాయిట్ ఛాంపియన్‌షిప్ (పురుషులు, మహిళలు) పోటీలను నిర్వహించనున్నారు. ఈ పోటీలకు 23 రాష్ట్రాల నుంచి క్రీడాకారులు హాజరు కానున్నారు. పురుషులు పలాస మదర్ థెరిసా పాఠశాలలో, మహిళలు ఎంజెపి పాఠశాలలో, రిఫరీలు స్థానిక ఉన్నత పాఠశాలలో ఉండేందుకు మౌలిక సౌకర్యాలు కల్పించారు. ఇప్పటికే పలు రాష్ట్రాల జట్లు చేరుకొని సాధన కూడా మొదలుపెట్టాయి.

మైదానంలో ఫ్లడ్‌లైట్ల వెలుగుల్లో ఈ పోటీలు జరుగనున్నాయి. ఈ పోటీలకు కార్యనిర్వాహక కార్యదర్శిగా పి.తవిటయ్య వ్యవహరించనున్నారు. జాతీయస్థాయి పోటీలు నిర్వహించనున్న పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానం పలుమార్లు రాష్ట్ర పోటీలకు వేదికగా నిలిచింది. ఇదివరకు కబడ్డీ, వాలీబాల్, యోగా, వెయిట్ లిఫ్టింగ్, టెన్నికాయిట్, చెస్, అథ్లెటిక్స్ అంశాల్లో ఇక్కడ రాష్ట్రస్థాయి పోటీలను నిర్వహించారు. జాతీయస్థాయి పోటీలకు పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం వేదిక కావడం ఆనందంగా ఉందని కార్యనిర్వాహక కార్యదర్శి పి.తవిటయ్య అన్నారు.

## సెలవు రోజూ తరగతులు

### అడ్డుకున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

విద్యార్థుల్లో మానసిన ఒత్తిడి తగ్గించేందుకు వీలుగా ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు సెలవు దినాలు తప్పక అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు డి.చందు, ఉపాధ్యక్షులు రాజు డిమాండ్ చేశారు. నగరంలోని కాకినాడ ఆదిత్య జూనియర్ కళాశాలలో ఆదివారం నిర్వహిస్తున్న తరగతులను ఎస్ఎఫ్ఐ నాయకులు అడ్డుకున్నారు. ప్రిన్సిపాలను నిలదీసి యాజమాన్య తీరును తప్పుపెట్టారు. సెలవు దినాల్లో తెరిచిన కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సెలవుల్లో తరగతులు నిర్వహించడం వల్ల విద్యార్థులపై ఒత్తిడి పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. నిబంధనలు పాటించని కార్పొరేట్, ప్రైవేట్ యాజమాన్యాలు గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వమే విద్యారంగాన్ని కాపాడాలని విద్యార్థులపై ఒత్తిడిని తగ్గించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్ఐఒకు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సంతు, మణి, రేవతి, భరణి తదితరులు పాల్గొన్నారు.



ప్రిన్సిపాల్‌ను నిలదీస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు



## సంక్రాంతికి ప్రత్యేక బస్సులు

### డిపిటిఒ ఎ.విజయ్ కుమార్

ప్రజాశక్తి - శ్రీకాకుళం



సంక్రాంతి సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి ఎ.విజయ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. రెగ్యులర్ సర్వీసులతో పాటు అదనంగా వేసే ప్రత్యేక బస్సుల్లోనూ సాధారణ ఛార్జీలనే వసూలు చేయనున్నట్లు స్పష్టం చేశారు. ఒకేసారి రానూపోనూ రిజర్వేషన్ చేసుకుంటే మొత్తం టిక్కెట్ ఛార్జీలో పది శాతం రాయితీ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. హైదరాబాద్ నుంచి ఈనెల 11వ తేదీన ఏడు నాన్ ఎసి బస్సులు, ఒక ఎసి బస్సు, 12వ తేదీన 9 బస్సులు, 13వ తేదీన ఆరు నాన్ ఎసి, ఒక ఎసి బస్సు ప్రత్యేకంగా నడుపుతున్నట్లు తెలిపారు. విజయవాడ నుంచి ఎనిమిది బస్సులు, రాజమండ్రి నుంచి ఐదు బస్సులు, అమలాపురం నుంచి రెండు బస్సులు మొత్తంగా 15 బస్సులు శ్రీకాకుళం జిల్లాకు రావడానికి ఏర్పాటు చేసినట్లు వివరించారు. విశాఖపట్నం ద్వారకా బస్‌స్టేషన్ నుంచి శ్రీకాకుళం, టెక్కలి, పలాస, ఇచ్ఛాపురం వెళ్లేందుకు ప్రతి పది నిమిషాలకు ఒక బస్సు ఏర్పాటు చేశామని తెలిపారు. రాత్రి 9.30 నుంచి ఉదయం ఐదు గంటల వరకు ప్రతి గంటకూ ఒక బస్సు నడుపుతున్నట్లు పేర్కొన్నారు. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ప్రత్యేక బస్సులు సిద్ధంగా ఉంచామని, వీటిని ప్రయాణికులు అవసరాలకు అనుగుణంగా నడుపుతామని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ఘనంగా జిల్లాస్థాయి చెకుముకి సంబరాలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యాన జిల్లాస్థాయి చెకుముకి సైన్సు సంబరాలను నగరంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సంబరాల్లో మండల స్థాయిలో ఎంపికైన 65 టీమ్‌లకు చెందిన 195 మంది విద్యార్థులు పాల్గొన్నారు. చెకుముకి పోటీల్లో విజేతలుగా ప్రభుత్వ పాఠశాలల విభాగం నుంచి శ్రీకాకుళం ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలకు ప్రథమ స్థానం, జలుమూరు మండలం పెద్ద దూగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ద్వితీయ స్థానం, కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, నరసన్నపేట మహాత్మా జ్యోతిబాపూలే బిసి వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ తృతీయ, జి.సిగడాం ఎపి మోడల్ స్కూల్ నాలుగో స్థానం దక్కించుకున్నాయి. ప్రైవేటు పాఠశాలల విభాగం నుంచి నగరంలోని గీతాంజలి స్కూల్ ప్రథమ, రణస్థలం ఆర్డర్ స్కూల్ ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నాయి. ఉప విద్యాశాఖ అధికారి జి.పగడాలమ్మ, జిల్లా సైన్స్ అధికారి ఎన్.కుమారస్వామి, పూర్వ ఉప విద్యాశాఖ అధికారి కొత్తకోట అప్పారావులు పోటీలను పర్యవేక్షించారు. అనంతరం జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు కుప్పిలి కామేశ్వరరావు, ఎపిపిఎస్‌టిఎఫ్ గౌరవాధ్యక్షులు ఎస్.ఎస్ శ్రీనివాస్ శర్మ, జెవివి రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్‌తో కలిసి వారు విజేతలకు బహుమతులు అందజేశారు.



## వ్యవసాయాధారిత పరిశ్రమలు నెలకొల్పాలి

### పల్సస్ సంస్థ సిఇఒ గేదెల శ్రీనుబాబు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఉత్తరాంధ్ర వెనుకబాటును పారదోలాలంటే వ్యవసాయాధారిత పరిశ్రమలు నెలకొల్పాలని పల్సస్ సంస్థ సిఇఒ గేదెల శ్రీనుబాబు అన్నారు. ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను చైతన్యం చేసే దిశగా నగరంలోని ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో ఉత్తరాంధ్ర రైతు సదస్సును ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో ప్రధాన జీవనాధారం వ్యవసాయమన్నారు. 90 శాతం రైతులకు ఇదే తెలుసునని అందులోనూ సీజనల్ పంటలకే ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు. సకాలంలో వర్షాలు కురవక, సాగునీరు అందుబాటులో లేక సాగు కష్టాలతో ఏటా ఆర్థికంగా కుదేలవుతుంటారని ఆవేదన వ్యక్తం చేశారు. పొట్ట చేతపట్టుకుని దేశం నలమూలల వలస వెళ్లి జీవనోపాదిని వెతుక్కోవలసి వస్తోందన్నారు. ఇటువంటి పరిస్థితుల నుంచి అన్నదాతలను గట్టెక్కించడం పల్సస్ సంస్థ లక్ష్యమన్నారు. పల్సస్ ద్వారా అధునాతన ఆవిష్కరణలకు తెరతీస్తున్నామని పేర్కొన్నారు. వరి పొలాల నుంచి అన్నదాతను లాభదాయకమైన పంటల వైపు మళ్లిస్తున్నామన్నారు. సుస్థిర వ్యవసాయ కారిడార్ల ద్వారానే ఉత్తరాంధ్ర వలసలను ఆపి భవిష్యత్‌ను మార్చగలమన్నారు. అందులో భాగంగానే రైతు విజ్ఞాన సదస్సులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డిజిటల్ మార్కెటింగ్ ద్వారా రైతులను నేరుగా వినియోగదారులకు అనుసంధానించడంపై ఈ సదస్సుల ద్వారా అన్నదాతకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రపంచవ్యాప్తంగా 42 నుంచి 45 దేశాల్లో మన వాణిజ్య ఉత్పత్తులను ప్రపంచవ్యాప్తంగా దిగుమతి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. అనంతరం పలువురు ఆదర్శ రైతులు, హారికా కన్‌స్ట్రక్షన్ అధినేత హారికా ప్రసాద్‌ను సన్మానించారు. సదస్సులో పంచాయతీరాజ్ ఛాంబర్స్ రాష్ట్ర కార్యదర్శి ఆనెపు రామకృష్ణ, తూర్పు కాపు సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు సురంగి మోహనరావు, తూర్పు కాపు భవన నిర్మాణ కమిటీ కార్యదర్శి లంక గాంధీ, హారికా ప్రసాద్, రిటైర్డ్ జెసి రెడ్డి గున్నయ్య, పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాన కృష్ణచంద్ పాల్గొన్నారు.

## ఉత్సాహంగా జిల్లా స్థాయి తైక్వాండో పోటీలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ తైక్వాండో పోటీల్లో సత్తా చాటి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని సీనియర్ న్యాయవాది నౌపడ విజయ్ కుమార్ ఆకాంక్షించారు. నిరంతరం సాధన చేస్తూ కోచ్‌ల వద్ద మెళకువలు నేర్చుకుని క్రీడల్లో రాణించాలని సూచించారు. జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యాన నగరంలోని టౌన్ హాల్‌లో 37వ జిల్లాస్థాయి సబ్ జూనియర్ కొర్గీ, 12వ జిల్లాస్థాయి సబ్ జూనియర్ పూమ్ సే పోటీలను ఆదివారం నిర్వహించారు. అసోసియేషన్ కార్యదర్శి తైక్వాండో శ్రీను, ఫెన్సింగ్ అసోషియేషన్ జిల్లా అధ్యక్షులు బలభద్రుని రాజాతో కలిసి పోటీలను ప్రారంభించారు. సబ్ జూనియర్ స్థాయి క్రీడాకారులు జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చి ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. జిల్లా నుంచి ఎంపికైన క్రీడాకారులు ఈనెల 20, 21 తేదీల్లో నంద్యాలలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. జిల్లా స్థాయి సబ్ జూనియర్ కొర్గీ, పూమ్స్ సే విభాగాల్లో సత్తా చాటిన బాలబాలికలకు కేటగిరీల వారీగా స్వర్ణ, రజత, కాంస్య పతకాలు, ధ్రువపత్రాలను అందజేశారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా మజ్జి గౌతమ్, పి.నవీన్, ఎన్.రవి, వి.జాస్మిన్, గణ సాయి, సాయి బాలాజీ, వి.మదన్, మేఘన, సమ్రిన్, జనార్ధన్ వ్యవరించారు. ఎన్.శేఖర్ (టెక్కలి కోచ్), జగదీశ్వరరావు (కోచ్), రాహుల్ (కోచ్) రిఫరీలుగా వ్యవహరించారు.




పోటీలను ప్రారంభిస్తున్న విజయ్ కుమార్

## 'లోతుగెడ్డ'కు టిక్కెట్ ఇవ్వాలి

ప్రజాశక్తి- కొత్తూరు

లోతుగెడ్డ తులసీ వరప్రసాదరావుకు ఎమ్మెల్యే టిక్కెట్ ఇవ్వాలని వైసిపి నాయకులు తెలిపారు. ఆదివారం మెట్టూరు బిట్-2లో వైసిపి సోషల్ మీడియా నియోజకవర్గ ఇన్‌ఛార్జి ప్రశాంత్ కుమార్ ఆధ్వర్యంలో వైసిపి సోషల్ మీడియా కార్యకర్తలు లోతుగెడ్డ తులసీ వర ప్రసాదరావుకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా శేపాన విక్రమ్, ప్రశాంత్ కుమార్, రేగాన తిరుపతిరావు, రవ్వల మన్మోహన్ మాట్లాడుతూ ఎమ్మెల్యే రెడ్డి శాంతి నాన్‌లోకల్ వ్యక్తి అయినప్పటికీ జగన్మోహన్ రెడ్డిని సిఎం చేయాలని ఉద్దేశంతో ఆమెను భారీ మెజారిటీతో గెలిపించడం జరిగిందని, ఈసారి స్థానికేతరులకు కాకుండా స్థానిక నాయకులకు ఎమ్మెల్యే అభ్యర్థిగా టిక్కెట్ ఇస్తే మూడోసారి వైసిపి విజయకేతనం ఎగరవేస్తుందన్నారు. స్థానిక నాయకులైన లోతుగడ్డ తులసి వరప్రసాదరావును ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో బూరాడ శంకర్రావు, టంకాల సాయి, లోతుగడ్డ పవన్, లోతుగడ్డ నాని, ఆగతముడి రంజిత్ కుమార్, సవిరిగాన ధనుంజయ, యర్లంకి మహేశ్వరరావు, తలగాపు మణికంఠ, శంకరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రశాంత్‌కుమార్ తదితరులు

## నేడు ఆయుష్ మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయ ప్రాంగణంలో ఇంద్ర పుష్కరిణి వద్ద సోమవారం వెయ్యి మందితో సూర్య నమస్కారాల కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయుష్ సీనియర్ మెడికల్ ఆఫీసరు పి.జగదీష్ ఒక ప్రకటనలో తెలిపారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆయుష్ మంత్రిత్వశాఖ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఆయుష్ సిబ్బంది, హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ, యోగా సంఘాల సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు తెలిపారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

అనంతరం అసరవల్లిలో ఆయుష్, యునాని, హోమియో విభాగాలు సంయుక్తంగా మెగా వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగ పరచుకోవాలని సూచించారు. శిబిరంలో ఆయుష్ సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.జగదీష్, వైద్యాధికారులు టి.మహతి, వి.సీతామహాలక్ష్మి, ఎన్.ప్రసన్నలక్ష్మి హాజరు కానున్నట్లు తెలిపారు.



బ్లడ్ బ్యాంకును ప్రారంభిస్తున్న ఎంపీ రామ్మోహన్ నాయుడు

## విజయశ్రీ బ్లడ్ బ్యాంకు ప్రారంభం

**ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్**

జిల్లా కేంద్రంలో మరో బ్లడ్ బ్యాంకు సేవలు అందుబాటులోకి వచ్చాయి. నగరంలో డేఅండ్ నైట్ జంక్షన్ వద్ద విజయశ్రీ(వంశీతి) బ్లడ్ సెంటర్‌ను ఆదివారం రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు, ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడులు ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పెరుగుతున్న రక్త అవసరాలను తీర్చడానికి సేవాభావంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, పాతపట్నం నియోజకవర్గ నాయకులు గోవిందరావు పాల్గొన్నారు.



ఐసయ్య దంపతులకు సన్మానం చేస్తున్న శ్యామ్ సుందర్

## ఐసయ్యను ఆదర్శంగా తీసుకోవాలి

**ప్రజాశక్తి- పలాస**

ఐసయ్య ఎల్ఐసి సంస్థలో డెవలప్‌మెంట్ అధికారిగా చేరినప్పటి నుంచి నేటివరకు ఎల్ఐసి అభివృద్ధికి ఎంతో కృషి చేశారని తెలంగాణ, ఎపి, కర్ణాటక రాష్ట్రాల ఎల్ఐసి జోనల్ మేనేజర్ ఎల్.కె.శ్యామ్ సుందర్ అన్నారు. కాశీబుగ్గ రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో ఆదివారం ఎల్ఐసి డిఒ ఐసయ్య ఉద్యోగ విరమణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలాస ఎల్ఐసి బ్రాంచ్ వ్యాపార పరంగా పలుమార్లు మొదటి స్థానాన్ని దక్కించుకోవడానికి కారణం ఐసయ్యని ప్రశంసించారు. ముందుగా యువతకు ఎల్ఐసిపై అవగాహన కల్పించి వారితో పాలసీలు ఎలాచేయాలో మెలకువలు నేర్పించి ఎంతోమంది ఎల్ఐసి ఏజెంట్లను నియమించి వారితో వ్యాపారం చేయించడమే కాకుండా సంస్థ అభివృద్ధికి కృషి చేశారన్నారు. అనంతరం ఐసయ్య, మధు దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో విశాఖపట్నం ఎల్ఐసి డివిజన్ మేనేజర్ శారద ప్రసాద్ దాస్, మార్కెట్ మేనేజర్ బి.ఎస్.చక్రవర్తి, పలాస ఎల్ఐసి చీఫ్ మేనేజర్ బిసోయ్, ఎల్ఐసి ఉద్యోగులు, యూనియన్ నాయకులు, ఏజెంట్లు పాల్గొన్నారు.

## క్రీడలతో మానసికోల్లాసం

**ప్రజాశక్తి- కవిటి**

క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని ఎమ్మెల్యే బెందాళం అశోక్, ఎమ్మెల్సీ నర్తు రామారావు, జనసేన ఇన్‌ఛార్జి దాసరి రాజు అన్నారు. మండలం డిజి పుట్టుగ గ్రామంలో శ్రీ ప్రతిభ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ మాట్లాడుతూ క్రీడా పోటీలతో పల్లెల్లో పండగ శోభ సంతరించుకుంటుందన్నారు. ఇటువంటి పోటీల ద్వారా గ్రామీణ క్రీడాకారుల్లో ప్రతిభ వెలుగులోకి వస్తుందన్నారు. పోటీల్లో విజేతలకు రూ.20వేలు ట్రోఫీ, రెండో స్థానంలో నిలిచిన జట్టుకు రూ.12వేలు, ట్రోఫీతో పాటు మేన్ ఆఫ్ ది మ్యాచ్, మేన్ ఆఫ్ ది సిరీస్ బహుమతులు అందజేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్, సర్పంచ్ బెందాళం కిరణ్ కుమార్ జయప్రకాష్, ఎంపిటిసి చందాన పూర్ణచంద్రుడు, మాజీ సర్పంచ్ గొనప హైమావతి కన్నయ్య, నాయకులు వివేకానంద రెడ్డి, ఎన్.ప్రేమ్ కుమార్, కాళ్ళ జయదేవ్, యువజన సంఘ సభ్యులు పాల్గొన్నారు.




కమిటీ సభ్యులకు విరాళం అందిస్తున్న విశ్రాంత డిఎస్‌పి

## ఆలయ నిర్మాణానికి విరాళం

**కవిటి:** మానవ జీవితానికి ఒక్క ఆధ్యాత్మిక, సామాజిక సేవలోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని విశ్రాంత డిఎస్‌పి ఎస్‌వివి ప్రసాదరావు అన్నారు. బెహరావీధిలో పున:నిర్మితమవుతున్న శ్రీ జగన్నాథస్వామి ఆలయం, బీచ్‌రోడ్డులో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి రూ.40వేలు ఆర్థికసాయం అందించారు. అలాగే విశాఖపట్నంకు చెందిన తన స్నేహితులు కొన్న వెంకటేశ్వరరావు, అప్పలనాయుడు, వెంకటరమణ అందించిన రూ.80 వేలు కమిటీ సభ్యులకు అందించారు. బెహరా వీధికి చెందిన ఫకీర్ మాస్టారు దంపతులు జగన్నాథ స్వామి ఆలయ నిర్మాణానికి తమవంతుగా రూ.45వేలు అందించారు. ఈ సందర్భంగా విశ్రాంత డిఎస్‌పి ప్రసాదరావు మాట్లాడుతూ తరాలుగా వస్తున్న వారసత్వ సంపద కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని అన్నారు. ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి నిర్మాణం జరుపుకుంటున్న జగన్నాథస్వామి, వేంకటేశ్వరస్వామి ఆలయాల నిర్మాణాలకు దాతలు విరాళాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో మొగిలిపురి సీతాలు, బిపి రెడ్డి, తిరుపతి బెహరా, లోజనాథం, రుద్రయ్య పాల్గొన్నారు.

## కొనసాగుతున్న దీక్షలు

**కవిటి:** తమజాతి గుర్తింపు, తమ భవిష్యత్ భరోసా కోసం బెంతు ఒరియాలు చేస్తున్న రిలే నిరాహారదీక్షలు 11వ రోజుకి చేరుకున్నాయి. అందులో భాగంగా ఆదివారం దీక్షలో పాల్గొన్న బెంతు ఒరియా ప్రతినిధులు మాట్లాడుతూ తమజాతికి గుర్తింపు లభించే వరకు, తమ బిడ్డల భవిష్యత్‌కు భరోసా దక్కేవరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ దీక్షల్లో రజనీ కుమార్ దొలై, పాండు దళాయి, సుదర్శన్ బిసాయి, జయసేన్ బిసాయి, మేఘనత్ బిసాయి, శ్రీరామ్మూర్తి బిసాయి, భిమ్మో సాహు, మాధవరావు దలై పాల్గొన్నారు.



జ్ఞాపికను స్వీకరిస్తున్న హరీష్

## అరసవల్లిని సందర్శించిన ఐఎఎస్ అధికారి

**శ్రీకాకుళం అర్బన్:** అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని ఆదివారం తెలంగాణ ఐఎఎస్ అధికారి హరీష్ సతీసమేతంగా సందర్శించారు. ఆయనకు ఆలయ మర్యాదలతో ఆర్‌డిఒ రంగయ్య, ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మలు స్వాగతం పలికారు. ఆలయంలో స్వామివారికి సేవలు నిర్వహించిన అనంతరం ఆలయ ప్రాంగనంలో అనివేటి మండపంలో స్వామివారి శేష వస్త్రాలను కప్పి ఆర్‌డిఒ, ఆలయ ఇఒ వి.హరి సూర్యప్రకాష్‌లు జ్ఞాపికను అందజేశారు.

## టీకాలు తప్పనిసరి

**కోటబొమ్మాళి :** ప్రభుత్వం పశువులకు ఉచితంగా అందజేస్తున్న గాలికుంటువ్యాధి నివారణ టీకాలను పాడి రైతులు పశువులకు తప్పనసరిగా వేయించుకోవాలని పశువైద్యాధికారి డాక్టర్ లఖినేని కిరణ్‌కుమార్ అన్నారు. ఆదివారం మండలం బలరాంపురం, సరియాపల్లి గ్రామాల్లో గాలికుంటు వ్యాధి టీకాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 296 పశువులకు టీకాలు వేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పిట్ట భారతి, పశువైద్య సిబ్బంది ముకుందరావు, వెంకటరావు, ధర్మారావు, నారాయణరావు పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్మికుల డిమాండ్లను నెరవేర్చాలి



ఆమదాలవలస : చెవిలో పువ్వులతో నిరసన తెలుపుతున్న కార్మికులు

**ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్**

న్యాయ సమ్మతంగా మున్సిపల్ కార్మికులు సమస్యల పరిష్కారాన్ని కోరుతూ పోరాడుతున్నా, రాష్ట్ర ప్రభుత్వం మొద్దు నిద్రలో చలనం లేని దుస్థితిలో ఉందని జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు గొండు శంకర్ పేర్కొన్నారు. ఆదివారం నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికులు కొనసాగిస్తున్న సమ్మె శిబిరాన్ని సందర్శించిన ఆయన వారికి సంఘీభావం తెలిపారు. సమ్మె కారణంగా మున్సిపల్ కార్మికుల జీవనం కష్టతరంగా మారుతుందని ప్రభుత్వాన్ని విన్నవించుకున్నా పట్టించుకోక పోవడం దారుణమన్నారు. తక్షణమే సమస్యలను పరిష్కరించి కార్మికులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. కార్మికులను ఇబ్బంది పెట్టి రోడ్లపైకి తీసుకొచ్చిన ఘనత జగన్మోహనరెడ్డికే దక్కుతుందన్నారు. డిమాండ్ల పరిష్కారాన్ని కోరుతూ సమ్మె చేస్తుంటే ప్రత్యామ్నాయ చర్యల పేరుతో వేదింపులకు గురి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎస్.బలరాం, ఉపాధ్యక్షులు ఆరుగుళ్ల గణేష్, టిఎన్‌టియుసి నాయకులు దొండపాటి నవీన్ కుమార్, కార్మికులు భాస్కర్, పార్వతి పాల్గొన్నారు.

**పలాస:** మున్సిపల్ కార్మికులు కాశీబుగ్గ గాంధీ విగ్రహం వద్ద 13వ రోజు నిరవధిక సమ్మె చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, శ్రీనివాసరావు, యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్ మురగన్, ఎం.రవి, యూనియన్ నాయకులు దివాకర్, ఎస్.శంకర్, తిరుపతి, ప్రకాష్ ముఖి, సీతమ్మ, గులాబీ, సావిత్రి, లక్ష్మీ పాల్గొన్నారు.

**ఆమదాలవలస:** పట్టణంలోని మున్సిపల్ కాంప్లెక్స్ వద్ద మున్సిపల్ కార్మికుల నిరవధిక సమ్మె 13వ రోజు చేపట్టారు. ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించేంతవరకు వెనకడుగు వేసేది లేదని సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు. చెవిలో పువ్వుపెట్టుకుని నిరసన తెలిపారు. కార్యక్రమంలో పారిశుధ్య కార్మిక నాయకులు కె. తారకేశ్వరరావు, కె. శ్రీనివాసరావు, జె.శ్రీను పాల్గొన్నారు.



ఇచ్ఛాపురం : భజన చేస్తూ నిరసన వ్యక్తం చేస్తున్న మున్సిపల్ కార్మికులు

**ఇచ్ఛాపురం:** మున్సిపల్ కార్మికులు నిరవధిక సమ్మెలో భాగంగా దీక్షా శిబిరంలో సామూహిక భజన చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. 13 రోజులుగా మున్సిపల్ కార్మికులు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం డిమాండ్స్ ఒప్పుకోలేదని సిఐటియు కన్వీనర్ రమేష్ కుమార్ పట్నాయక్ అన్నారు. డిమాండ్ల పరిష్కార సాధన కోసం నిరవధిక సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు.

## అంగన్వాడీలపై ఎస్మా దుర్మార్గపు చర్య : జనసేన



టెక్కలి : మాట్లాడుతున్న కిరణ్‌కుమార్

**ప్రజాశక్తి- టెక్కలి**

అంగన్వాడీలపై జగన్ ప్రభుత్వం ఎస్మా ప్రయోగించడం దుర్మార్గపు చర్యని టెక్కలి జనసేన ఇన్‌ఛార్జి కణితి కిరణ్ తెలిపారు. ఆదివారం టెక్కలి జనసేన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ అంగన్వాడీ వ్యవస్థ చాలా గొప్పదని వారు బహుముఖ పాత్ర పోషిస్తూ గ్రామీణులకు సేవలు అందిస్తున్నారని తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం వారికి తక్షణమే గ్రాడ్యూటీని వర్తింప చేసి, రూ.26 వేలు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీల సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే రాబోయే ఎన్నికల్లో అంగన్వాడీల కన్నీటి వరదల్లో వైసిపి కొట్టుకుపోతుందని కణితి కిరణ్ హెచ్చరించారు.

**పలాస:** అంగన్వాడీలపై జగన్ సర్కార్ ఎస్మాచట్టాన్ని ప్రయోగించడం సిగ్గుచేటని ప్రగతిశీల మహిళా సంఘం (పిఒడబ్ల్యు) జిల్లా అధ్యక్షులు బతకల ఈశ్వరమ్మ విమర్శించారు. కాశీబుగ్గ సూది కొండలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. అంగన్వాడీలు తమ సమస్యలు పరిష్కరించాలని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని 27 రోజులుగా ధర్నా చేస్తుంటే ఎస్మా ప్రయోగం చేయడం దారుణమన్నారు. దీన్ని పగతిశీల మహిళా సంఘం తరపున తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సమావేశంలో సుహాసిని, సరస్వతి పాల్గొన్నారు.

**ఆమదాలవలస :** అంగన్వాడీ కార్మికులపై ఎస్మా చట్టం ప్రయోగించడం దుర్మార్గమని "ఐ"లు రాష్ట్ర కమిటీ సభ్యుడు బొడ్డేపల్లి మోహనరావు అన్నారు. డిమాండ్ల సాధన కోసం చేస్తున్న శాంతియుత ఆందోళనను అణచివేయాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఎస్మా చట్టాన్ని ప్రయోగించడాన్ని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) తీవ్రంగా ఖండిస్తున్నదని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్మా చట్టాన్ని అంగన్వాడీ కార్మికులపై ప్రయోగించడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. కార్మిక ఉద్యమాలను అణచివేయాలను కోవడం ప్రభుత్వ నియంతృత్వ ధోరణికి నిదర్శనమన్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం గ్రాడ్యూటీని అమలు చేయాలని ఆలిండియా లాయర్స్ యూనియన్ డిమాండ్ చేస్తుందని తెలిపారు.



మాట్లాడుతున్న బలరామమూర్తి మాస్టర్

## ఘనంగా వివేకానంద జయంతి

**ప్రజాశక్తి- కవిటి**

స్వామి వివేకానంద జయంతి (జనవరి 12) ముందస్తు వేడుకలు కవిటి కళ్యాణి ఆంగ్ల పాఠశాల ఆవరణలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు పండి బలరామమూర్తి జ్యోతి ప్రజ్వలన చేసి, వివేకానంద జీవిత చరిత్రను విద్యార్థులకు వివరించారు. అనంతరం స్వామి వివేకానంద జీవితం - విద్యార్థులకు మార్గదర్శకం అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో 12 పాఠశాలల నుంచి 57 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు ఈనెల 12న బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ బి.రమేష్, ప్రిన్సిపాల్ బిందు మాధవి, ఉపాధ్యాయులు నీలాచలం, కిరణ్, నాగేశ్వరరావు, సత్యానందం, ముకుంద, దివ్య పాల్గొన్నారు.

**శ్రీకాకుళం అర్బన్:** భారతీయ సంస్కృతి సేవా తత్పరత త్యాగ నిరతికి స్వామి వివేకానంద ప్రతి రూపమని లయన్స్ క్లబ్ శ్రీకాకుళం మెంటారు నటుకుల మోహన్ అన్నారు. ఆదివారం లయన్స్‌క్లబ్ కార్యాలయంలో శ్రీశారదా రామకృష్ణ సేవాసమితి ఆధ్వర్యాన జాతీయ యువజనోత్సవాలను నిర్వహించారు. ఈవేడుకల్లో తొలుత ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. కార్యమంలో డాక్టర్ బాడాన దేవభూషణరావు, మురళీమోహన్ పాల్గొన్నారు.



సంతాప సభలో నివాళ్లర్పిస్తున్న శివాజీ, శిరీష

## చెంచమ్మ మృతి తీరని లోటు

**ప్రజాశక్తి- పలాస**

మాజీ కౌన్సిలర్, టిడిపి సీనియర్ నాయకులు గాలి చెంచమ్మ మృతి పార్టీకి తీరని లోటని మాజీ మంత్రి గౌతు శివాజీ, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష అన్నారు. పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి ఉదయపురంలో ఆదివారం చెంచమ్మ సంతాపసభ నిర్వహించారు. ముందుగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి కృషితో పాటు మున్సిపాలిటీ కౌన్సిలర్ పదవి చేపట్టి వార్డు అభివృద్ధికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా కార్యదర్శి గాలి కృష్ణారావు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పి. విఠల్‌రావు, లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, మాజీ ఎంపిపి బత్తిని హేమేశ్వరరావు, డొక్కారి శంకర్ పాల్గొన్నారు.



మందులను అందజేస్తున్న ఎస్ఐ లక్ష్మణరావు

## ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

**ప్రజాశక్తి- పొందూరు**

పట్టణంలో ప్రశాంతి క్లినిక్ ఆయుర్వేద వైద్యులు డాక్టర్ సునీల్ కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని ఎస్ఐ లక్ష్మణరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా కీళ్లు, మోకాలు, నడుము నొప్పులతో పాటు, ఆస్తమా, ఫైల్స్ పరీక్షలు జరిపారు. అలాగే రాజేశ్వరి లేబరేటరీచే షుగర్ పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. 82 మందికి పరీక్షలు జరిపి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ల్యాబ్ అసిస్టెంట్ రమేష్, స్టాఫ్ అంజలి, రామలక్ష్మి, రాజస్థాన్ ఔషదాలయం బిడిఒ రవి పాల్గొన్నారు.

## వసతిగృహంలో సంక్రాంతి సంబరాలు

**ప్రజాశక్తి- పలాస**

పలాస బాలికల వసతి గృహంలో ఆదివారం క్రాంతి-సంక్రాంతి కార్యక్రమంలో భాగంగా సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. బాలికలు ముగ్గులు వేశారు. అనంతరం భోగి మంటలు వేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో వసతి గృహ వార్డెన్ డి.కృష్ణవేణి, విద్యార్థులు పాల్గొన్నారు.

## సమగ్రశిక్ష ఉద్యోగుల సమస్యలపై నిర్లక్ష్యం తగదు

**శ్రీకాకుళం అర్బన్:** రాష్ట్ర వ్యాప్తంగా సమగ్ర శిక్ష, కెజిబివి ఉద్యోగులు గత 19 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు ధ్వజమెత్తారు. నగరంలో జ్యోతిరావు పూలే పార్కు వద్ద సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె శిబిరాన్ని ఆదివారం సందర్శించారు. సమగ్ర శిక్ష, కెజిబివిల్లో ఉన్న అన్నివిభాగాల్లో కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు గడచిన 19 రోజులుగా సమ్మె చేస్తున్నా సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం అడ్డదారుల్లో ఒత్తిళ్లకు గురి చేస్తున్నారని, ఇటువంటి చర్యలను ఖండించాలని పిలుపునిచ్చారు. ఈ శిబిరంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్. కిషోర్‌కుమార్, ఎన్‌టిఎఫ్ జిల్లా అధ్యక్షులు సూర పాపారావు, యుటిఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు మజ్జి మోహనరావు మాట్లాడారు. న్యాయసమ్మతమైన డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపించి చర్చలకు పిలవాలన్నారు. సమ్మె చేయడం రాజ్యాంగం కల్పించిన హక్కని, ఇటువంటి సమ్మె హక్కును కాలరాయాలని చేస్తున్న ప్రయత్నాలు మానుకోవాలన్నారు. కార్యక్రమంలో సమగ్ర శిక్షా ఉద్యోగుల జెఎసి అధ్యక్షులు పైడి మురళీకృష్ణ, కోశాధికారి డి.శ్రీనివాసరావు, కార్యవర్గసభ్యులు నర్సింగరావు, యుగంధర్, గౌరీ శంకర్, శైలజ, జ్యోతి, రోహిణి, భారతి భవాని, నాగమణి, శశిరేఖ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

## అగ్నికుల క్షత్రియులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలి

**సోంపేట:** జిల్లా అగ్నికుల క్షత్రియ యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో ఆదివారం పలాస నుంచి బారువ బీచ్ వరకు వందలాది బైకులతో ర్యాలీ నిర్వహించి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వేలాదిమంది అగ్నికుల క్షత్రియులు హాజరై తమకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. కార్యక్రమానికి హాజరైన జాతీయ అధ్యక్షులు నాగిడి సాంబశివరావు మాట్లాడుతూ ఇచ్చాపురం నుంచి కుప్పం నియోజకవర్గం వరకు 50 లక్షల జనాభా కలిగిన అగ్నికుల క్షత్రియ కమ్యూనిటీని నాయకులు పట్టించుకోకుండా, రాజకీయ ప్రాధాన్యత కల్పించకుండా తమను ఓటర్లుగా చూస్తున్నారన్నారు. అగ్నికుల క్షత్రియల న్యాయమైన డిమాండ్లను తీర్చడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. రాబోయే ఎన్నికల్లో తమ కమ్యూనిటీకి కనీసం 15 అసెంబ్లీ స్థానాలను, రెండు ఎంపీ స్థానాలను, రెండు ఎమ్మెల్సీ స్థానాలను కేటాయించాలని, అలాగే ప్రభుత్వ ఏర్పడ్డాక నామినేటెడ్ పదవుల్లో 50శాతం రాయితీని కల్పించాలని డిమాండ్ చేశారు. జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ మేడా వెంకట నరసింహారావు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో అన్ని పార్టీలు అగ్నికుల క్షత్రియులకు పార్టీలో స్థానం కల్పించకపోతే యూత్ ఫోర్సు నుంచి 50 స్థానాల్లో పోటీ చేయడానికి యూత్ ఫోర్స్ సభ్యులను సిద్ధం చేస్తామని హెచ్చరించారు. స్వర్గీయ జుతు జగన్ నాయకులు విగ్రహం ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు శివంగి వాసు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దున్న గాంధీ వర్మ, వర్కింగ్ ప్రెసిడెంట్ తాల్ల మురళీకృష్ణ, సోంపేట మండల అధ్యక్షులు కుమార్ స్వామి, తాతారావు, దున్న లోకనాథం, కోదండ కృష్ణ, పాతిన శేషగిరి, బత్తిన లక్ష్మణ్ పాల్గొన్నారు.



బారువలో అగ్నికుల క్షత్రియుల సమావేశం

## కళింగ సంక్షేమానికి పనిచేద్దాం

**పలాస:** కళింగ సంక్షేమానికి ఐకమత్యంతో పని చేద్దామని కళింగ సామాజిక వర్గానికి చెందిన పలువురు వక్తలు అన్నారు. రంగోయి జంక్షన్ జాతీయ రహదారి సమీపంలో ఆదివారం ప్రముఖ వైద్యులు దువ్వాడ జీవితేశ్వరరావు అధ్యక్షతన కళింగ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ వైద్యులు దానేటి శ్రీధర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కార్పొరేషన్ మాదిరిగా సొంతంగా కళింగ కార్పొరేషన్ ఏర్పాటు చేస్తే తనవంతుగా రూ.2 కోట్లు మూల ధనం ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. మాజీ ఎమ్మెల్యే కూన రవికుమార్ మాట్లాడుతూ కళింగ సామాజిక వర్గానికి చెందిన అనేక మంది రాజకీయాల్లో రాణించారని, జిల్లా అభివృద్ధితో పాటు కళింగ సంక్షేమానికి కృషి చేశారని గుర్తు చేశారు. మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు మాట్లాడుతూ గతంలో సామాజిక వర్గానికి చెందిన వారు అనేక రంగాల్లో రాణించారని, ప్రస్తుతం రాజకీయ రంగంలో వెనుక బడిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతకముందు జబర్దస్త్ నటులు బుల్లెట్ భాస్కర్, నరేష్, శాంతి స్వరూప్‌లు నటన పలువురిని ఆకట్టుకుంది. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ పిరియా విజయ, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ కుమార్, వజ్జ బాబురావు, మాజీ కేంద్ర మంత్రి కిల్లి కృపారాణి, దువ్వాడ హేంబాబు చౌదరి, మాజీ మున్సిపల్ చైర్మన్ కోత పూర్ణ చంద్రరావు, దువ్వాడ శ్రీకాంత్, హనుమంతు వెంకటరావు, హనుమంతు చిట్టి, సనపల సింహాచలం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ దానేటి శ్రీధర్

## శాస్త్రీయ కులగణనతో సత్ఫలితాలు

**ప్రజాశక్తి- కోటబొమ్మాళి**

శాస్త్రీయమైన కులగణనతో సత్ఫలితాలు ఉంటాయని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ఆదివారం టిడిపి కార్యాలయంలో ఎపి బిసి న్యాయవాదుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆగూరు ఉమామహేశ్వరరావు, చౌదరి లక్ష్మణరావు రూపొందించిన 2024 డైరీని ఆవిష్కరించారు. బిసిల సమస్యలను వెలుగులోకి తేడానికి ఇటువంటి డైరీలు ఉపయోపడతాయన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన తర్వాత బిసి కులగణనపై కేంద్రంపై ఒత్తిడి తీసుకువచ్చి శాస్త్రీయ గణన చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ ఎన్ని సూర్యారావు, న్యాయ వాదులు పాల్గొన్నారు. అలాగే సర్వశిక్ష అభియాన్ కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల యూనియన్ ఆధ్వర్యంలో సమ్మె నిర్వహిస్తున్నామని, సమ్మెకు టిడిపి సంఘీభావం తెలియజేయాలని ఆ సంఘ నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పోతయ్య, కె.రాము, టి.తారకేశ్వరరావు, బి.గిరిధర్, కె.రామకృష్ణ, కె.జయలక్ష్మి, ఆర్.సంతోష్ కుమార్, టి.పురుషోత్తం పాల్గొన్నారు.



డైరీని అవిష్కరిస్తున్న అచ్చెన్నాయుడు

## రైతులపై ప్రభుత్వ నిర్లక్ష్యం

**పలాస:** ఖరీఫ్‌లో వరి పంట సమయానికి వర్షాలు పడక, పొలాలకు నీరందక రైతులు నష్టపోయారని, వారిని ఆదుకోవడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని జనసేన నాయకులు డాక్టర్ దుర్గారావు, కూరాకుల యాదవ్ అన్నారు. కాశీబుగ్గ గాంధీ విగ్రహం వద్ద రైతులను ఆదుకోవాలని కోరుతూ ఆదివారం జనసేన నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాలా ప్రాంతాల్లో పొలాలు ఎండిపోగా, కొన్నిచోట్ల అరకొర నీరుతో పంటలు పండించినా కనీసం దిగుబడి కూడా రాలేదన్నారు. నెలక్రితం ప్రభుత్వాన్ని కరువు మండలాలుగా ప్రకటించాలని ఆర్‌డిఒ ద్వారా విజ్ఞప్తి చేసినా ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జీడి పంటకు మద్దతు ధర ప్రకటించాలని జీడి రైతులు వివిధ రూపాల్లో ఆందోళనలు, నిరసనలు, ధర్నాలు చేపట్టిన రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసిపి ప్రభుత్వంలో రైతులకు నష్ట పరిహారం అందలేదని, రైతులు కూలీలుగా మారి వలసలు పోతున్నారన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు కూన కృష్ణారావు, పి.శ్రీదేవి, ఉమా శంకర్, వంశీ చౌదరి, సవర శివ, సందీప్, గిరీష్, ఉదయ్ కిరణ్, దీన బంధు, జీడీ, వరి రైతులు పాల్గొన్నారు.

## కారు ఢీకొని వృద్ధుడు మృతి

**ప్రజాశక్తి- పలాస**

పలాస బైపాస్ రోడ్డు కంబిరిగాం జంక్షన్ వద్ద ఆదివారం ద్విచక్రవాహనంపై కోసంగిపురం వైపు వెళు తున్న ఆర్.షణ్ముఖరావు(60) అనే వ్యక్తిని వెనుక నుంచి భువనేశ్వర్ వైపు వెళ్తున్న కారు ఢీకొనడంతో మృతి చెందాడు. కాశీబుగ్గ పోలీసులు కథనం మేరకు టెక్కలి మండలం బన్నువాడ గ్రామానికి చెందిన షణ్ముఖరావు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా వెనుక నుంచి భువనేశ్వర్ వైపు వస్తున్న కారు ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడును 108 వాహనంలో పలాస ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం టెక్కలి ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతుడు కోసంగిపురంలో నివాసం ఉంటున్న తన కుమార్తెను సంక్రాంతికి పిలుపు చేయడానికి వచ్చి రోడ్డు ప్రమాదానికి గరికావడంతో వారి కుటుంబంలో విషాదం నెలకొంది. మృతుడుకు నలుగురు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎస్ఐ సంజీవరావు తెలిపారు.

## పూరిల్లు దగ్ధం

**ప్రజాశక్తి- మెళియాపుట్టి**

మండలంలో ఎత్తైనకొండ ప్రాంతంలో ఉన్న చందనగిరి గిరిజన గ్రామంలో ఆదివారం జరిగిన అగ్ని ప్రమాదంలో కేరాసింగి ఆదెమ్మకు చెందిన పూరిల్లు దగ్ధమైంది. రూ.50 వేలు ఆస్తినష్టం సంభవించింది. అగ్ని ప్రమాదంలో బట్టలు, ఫర్నిచర్, నిత్యవసర వస్తువులు దగ్ధమయ్యాయి. అగ్ని ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు. స్థానికులు మంటలను అదుపు చేశారు. నష్టపోయిన తనను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కన్నీరు మున్నీరయ్యాడు.

## పుస్తక ప్రదర్శన

**లావేరు:** స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం పుస్తక ప్రదర్శన, చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతినెల మొదటి శనివారం మన గ్రంథాలయం, ప్రతినెల మొదటి ఆదివారం పుస్తక ప్రదర్శన, ప్రతినెల ప్రతి ఆదివారం చదవడం మాకిష్టం, ప్రతినెల మూడవ శనివారం చిల్డ్రన్స్ క్లబ్ నిర్వహిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విద్యార్థులకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో సహాయకులు గడ్డియ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎంపీ పరామర్శ

**ప్రజాశక్తి- పలాస**

మండలం గురుదాసుపురం గ్రామానికి చెందిన టిడిపి మండల అధ్యక్షుడు కుత్తుం లక్ష్మణ్ కుమార్ తండ్రి కుత్తుం నర్సింహమూర్తి, మున్సిపాలిటీ పరిధి ఉదయపురం గ్రామ సీనియర్ టిడిపి నాయకులు గాలి కృష్ణారావు తల్లి, మాజీ కౌన్సిలర్ గాలి చెంచమ్మ ఇటీవల మతి చెందడంతో ఆదివారం మతుల కుటుంబాలను ఎంపీ రామ్మోహన్ నాయుడు పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయనతో పాటు టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, టిడిపి తెలుగు యువత మండల అధ్యక్షుడు కిక్కర ఢిల్లీరావు, మాజీ కౌన్సిలర్ కొవ్వూరు సురేష్ కుమార్, దాసునాయుడు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సంఘటితం కావాలి

**ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు**

ఒడియా బ్రాహ్మణులు సంఘటితంగా ఉండి సమస్యలను పరిష్కరించుకోవాలని ఒడియా బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శివాజీ పాణిగ్రాహి అన్నారు. ఆదివారం అక్కుపల్లి శివసాగర్ బీచ్‌లో వజ్రపుకొత్తూరు, నందిగాం, పలాస మండల పరిధిలో ఒడియా బ్రాహ్మణుల వన సమారాధన, ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒడియా బ్రాహ్మణులు ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడి ఉన్నారన్నారు. సమస్యలు సాధన కోసం ఐక్యంగా ముందుకు సాగాలని కోరారు. అంతా ఏకమై ముందుకు సాగినప్పుడే ఏదైనా సాధించుకోవచ్చు అన్నారు. కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ త్యాడి, కార్యదర్శి బాబూరావు పండా, రాఘవ పండా, బెన్ను త్యాడి, గౌతమ్ త్యాడి, హరిశంకర త్రిపాఠి, అరవింద్, కిశోర్ త్యాడి, రాము త్యాడి పాల్గొన్నారు.

## ఘనంగా తెరవే సాహితీ సమ్మేళనం

**ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్**

నగరంలోని శాంతినికేతన్ జూనియర్ కళాశాలలో తెలుగు రచయితల వేదిక 88 వ నెలవారీ సాహితీ సమ్మేళనం, సంస్థ అధ్యక్ష కార్యదర్శులు ఉత్తరావల్లి నాగేశ్వరరావు, రఘుపాత్రుని వెంకట రమణమూర్తి ఆధ్వర్యాన ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో 14 మంది కవులు పాల్గొన్నారు. సామాజిక పరమైన వివిధ అంశాలపై కవులు బి.కోమలరావు, ముట్నూరు ఉపేంద్రశర్మ, నిక్కు అప్పన్న, యు.నాగేశ్వరరావు, నిక్కు హరి సత్యన్నారాయణ, ఆర్.వి.రమణ మూర్తి, గుడిమెట్ల గోపాలకృష్ణ, తులాల సవరమ్మ, పివి.దుర్గాప్రసాద్ కవితలను వినిపించారు.

## ఉద్యమ స్ఫూర్తి బాలకృష్ణమ్మ

**టెక్కలి రూరల్ :** ఉపాధ్యాయ ఉద్యమ స్ఫూర్తి ప్రదాత మార్పు బాలకృష్ణమ్మ చేసిన త్యాగం, ఉపాధ్యాయులకు సాధించి పెట్టిన సౌకర్యాలు మరువరానివని పలువురు వక్తలు అన్నారు. ఆదివారం టెక్కలి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో బాలకృష్ణమ్మ సంస్మరణ సభ సురేష్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. తన తండ్రి మార్పు పద్మనాభం నుంచి కమ్యూనిస్టు భావాలను పుణికిపుచ్చుకుని తుదిశ్వాస వరకు ఉపాధ్యాయుల సంక్షేమానికి పోరాట పంథాను కోనసాగించారన్నారు. ఈ నెల 10న జిల్లా కేంద్రంలో జరిగే రాష్ట్రస్థాయి సంస్మరణ సభకు ఉపాధ్యాయులు పెద్దఎత్తున హాజరు కావాలని కోరారు. సమావేశంలో సీనియర్ నాయకులు చిట్టన్న, గున్న ప్రసాదరావు, బమ్మిడి రామారావు, చిలుకు కృష్ణారావు, జిల్లా కార్యదర్శి శేషగిరిరావు, నారాయణరావు, భాస్కరరావు పాల్గొన్నారు.

**కవిటి:** ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ కవిటి మండలశాఖ ఆధ్వర్యంలో కామ్రేడ్ మార్పు బాలకష్ణమ్మ వర్ధంతి సందర్భంగా ఆదివారం నిర్వహించిన నియోకవర్గ స్థాయి నవోదయ మోడల్ టెస్టులో కంచిలి విద్యార్థులు సత్తా చాటారు. 145 మంది విద్యార్థులతో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో జరిగిన ఈ పరీక్షలో కంచిలి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు చెందిన రామ్ రణవీర్, మోహిత్ రెడ్డిలు ప్రథమ, ద్వితీయ స్థానాలు కైవసం చేసుకోగా, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల బొరివంకకు చెందిన నవీన దలై మూడో స్థానం, కంచిలి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు చెందిన అఖిల్ కుమార్ పట్నాయక్ నాలుగోస్థానం సాధించారు. వీరికి ఎంఇఒ ధనుంజయ మజ్జి, ఎపిటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు బల్లెడ లక్ష్మణమూర్తి మెమెంటోలు, నగదు బహుమతులు అందజేశారు.